# పోరి-మంచం

కొమ్మూరి వేణుగోపాలరావు

**ప్రయుట ఉధృతంగా** వర్షం కురుస్తోన్న **రాత్రి పదిగంటలవేళ,** ఎంత తలుపులు **బిడాయించుకున్నా** చలిగాలి ఎలాగో దారిచేసుకుని లోపలకు ప్రవేశించి శరీరాన్ని పులకరింపజేస్తున్న సమయాన, వెచ్చదనంకోసం లైటు వేసుకుని, కంఠం వరకూ దుప్పటి కప్పుకుని, బల్లముందు కుర్చీలో కూర్చుని భార్య ఇందిరాప్రియ రాసిన ఉత్తరాన్ని ఆరవసారి చదువుకున్నాడు నిరీక్షణరావు.

నిరీక్షణరావు, ఇందిరాప్రియను ప్రేమించి పెళ్ళి చేసుకోలేదు. అసలు పెళ్ళి కాకముందు అతనికి ప్రేమంటే ఏమీ తెలియదు. జీవితంలో అతను గొప్పవాడు కాదు. గొప్ప ఊహాలూలేవు, ఉద్రూతలూ లేవు. అతను సంపాదించుకునేది నూట డెబ్భైరు రూపాయల జీతం. పెళ్ళి కాక ముందు ఆ జీతం అతనికి సరిపోయేది కాదు. సిగరెట్లకూ, కాఫీలకూ, సినిమాలకూ చాలాభాగం తగలేసేవాడు. భోజనానికి మాత్రం డబ్బు చాలక హోటళ్ళలో పద్దులు పెంచేవాడు. అతనికి తల్లీ దండ్రీ లేరు. అన్నలూ తమ్ములూ లేరు. అక్కలూ చెల్లెళ్ళూ లేరు. అంటే ఏకాకి అన్నమాట. కాని ఏకాకిగా బ్రతకడంలో సుఖం, దుఃఖం అత న్నేమీ స్పర్శించలేదు. మన దేశంలోని లక్షలాది సోమరిపోతుల్లా నిర్వికారంగా అతనూ జీవితం గడిపాడు. ఇంతలో యితన్నిలా జడునిలా వుంచడం బుద్ధిపొరపా టని ఏ పెళ్ళిళ్ళ పేరయ్యకో ఆలోచన స్ఫురించి, పట్టుబట్టి పది సంబంధాలు చూపించి, చివరకు ఒకటి ఖాయ పర్చాడు. ఆనుషంగికంగా పెళ్ళిళ్ళ పేరయ్య ప్రసాదించిన రత్నమే ఇందిరాప్రియ. ఆమె అర్ధాంగిగా తన గృహంలో అడుగుపెట్టిన తొలిరోజుల్లోనే, 'ఇన్నాళ్ళు ఎందుకు పెళ్ళి చేసుకున్నాను కా' నని బాధపడ్డాడు నిరీక్షణరావు. అతని జీవితానికి అర్థం, నిర్వచనం, వెన్నెల, తేజస్సు అన్నీ ఏర్పడినా యామె ప్రేమలో, ఆమె లాలనలో, ఆమె ఆకర్షణలో, ఆమె ప్రభావంలో, ఆమె మాధుర్యంలో, ఆమె నిండుదనంలో, ఆమె మంచితనంలో, ఆమె గాంభీర్యంలో, ఆమె శృంగార వాహినిలో, ఆమె మోహనరాగంలో, ఆమె ప్రసాదించే శాంతిలో, ఆమె గుమ్మరించిన పులకరింతలలలో నూతన రస జగత్తులో మునిగిపోయాడు. తన స్నేహితుల్నీ, పాత అలవాట్లనీ అన్నీ విస్మరించాడు. ఇందిరాప్రియ అతనికి కొత్త గుణ పాఠాలు నేర్పింది. అతనికి ఒక ఆకృతిని ఏర్పరిచి, పుష్టిని కలుగజేసింది. అతని అదృష్ట కవాటాలను సుతారంగా తెరిచింది. మైకంలో అతని కనులు మూసుకుని పోయాయి. అయితే అది మంచి మైకమే. అవి మంచి మూతలే.

అతను పొదుపు నేర్చుకున్నాడు. అతనికి సంపాదించుకునే కాసిని రూపాయలతో, అతనికి ఏయే వేళల్లో ఏయే అవసరాలు కావాలో అవన్నీ సుఖంగా అమరుతున్నాయి. మొదట అతన్లోని మార్పుని చూసి స్నేహితులు పరిహాసించారు. అతను చిరునవ్వు నవ్వి జవాబు చెప్పకుండా ఊరుకునేవాడు. క్రమంగా స్నేహితుల్ని విందులకి పిలవటం ప్రారంభించాడు. ఆ విందుల్లోని రుచీ, శుచీ, నిరాడంబరత్వం, వడ్డించే వ్యక్తిలోని రామణీయకతా చూసి వారు అతని అదృష్టానికి యీర్ష్యపడ్డారు.

అతనికి ఆమెతో గడిపిన ప్రతి రోజూ గుర్తు వుంది. ప్రతి నిముషమూ, ప్రతి స్పర్శా, ప్రతి చర్యా గుర్తున్నాయి. చల్లని ఆమె ఒడి, ఆశ్రయమిచ్చే ఆమె హృదయమూ, తనలో కలిపేసుకునే ఆమె మృదు హస్తాలూ, మధుర వీవెనలవంటి ఆమె నిట్టూర్పులూ, గాఢనిద్రవంటి పరిష్వంగాలూ, పెదిమల్నే కాదు, గుండెల్నే నొక్కే ఆమె పెదిమలూ...యీ ప్రవాహంలో అతను కూరుకుపోయాడు.

ఆమె అతన్ని "నిరూ!" అని పిలుస్తుంది ఏకాంతంగా వున్నప్పుడు. వేయి కోయిలలు కూసినట్లు, అసంఖ్యాకములైన షెహనాయ్‌లు మ్రోగినట్లు ధ్వనిస్తుంది ఆ పిలుపు.

ఒకరోజు ఆమె ఒడిలో తల పెట్టుకుని అతను పడుకున్నాడు పందిరిమంచంమీద. ఆ పందిరిమంచం ఆమె అడుగు పెట్టాక కొన్నదే. అంతకుపూర్వం అతను చాప, దిండుతో సరిపుచ్చుకునేవాడు.

"నిరూ!" అంది ఇందిరాప్రియ అతని తలవెంట్రుకలు సవరిస్తూ.

"ఊఁ"

"మనం ఇంత అనురాగంగా ఉండటం మంచిదికాదు సుమా!"

ఒక్కసారి అతను ఉలికిపడ్డాడు. తల ఎత్తి ఆమె ముఖంలోకి చూసేసరికి ఒత్తైన కనుబొమల క్రింద చేపల్లా సాగిన నల్లని నయనద్వయం లీలగా తడిసినట్లు కనిపించాయి.

"ఇందిరాప్రియా!" అన్నా డతను ఆతృతగా. అట్లా పిలవటమే అతనికి ఇష్టం.

తన చేతులు ఆమె కంఠం చుట్టూ వేసి, ఆమె ముఖాన్ని తన ముఖానికి దగ్గరగా లాక్కున్నాడు. వెచ్చని ఆవిరి సోకినట్లయింది. "ఎందు కట్లా అన్నావు చెప్పు

నువ్వు? ఎప్పుడూ వినలేదు, అలాంటి అపశృతి. చెప్పు నువ్వు!"

"ఇంత అనురాగం వుంటే—ఎప్పుడైనా నా కేమన్నా కీడు జరిగితే నువ్వేమయి పోతావు బాబూ!" ఆమెకంఠం చలించింది.

"ఊహు, వద్దు – అలాంటి మాటలు రానియ్యకు నీ నోటివెంట. అమంగళం పలుకకు. నేను ఊహించలేని విషయాలు నాకు సూచించకు."

అత నామె ముఖాన్ని వదిలి, పమిటలో తల దాచుకుని పసిపిల్లాడిలా తల్లడిల్లుతున్నాడు.

"అనులే" అన్న దామె ఓదారుస్తూ ఉన్నట్లు. కొన్నిక్షణాలు మౌనంగా ఊరుకుని "ఇంత ప్రేమ కురిపిస్తున్నావు కదా! న న్నెప్పుడైనా అన్యాయం చేస్తావా ?" అనడిగింది పొడిగా.

"అంటే?" అడిగాడు సరిగ్గా అర్థంగాక.

"మొగాడివి. మనసు మారితే పర్వా లేదు, మరలితే ?"

"ఇందిరాప్రియా!" అని గట్టిగా అరిచాడతను. "ఇంతేనా నువ్వు నన్ను అర్థం చేసుకున్నది? ఎలాంటి పరిస్థితిలోనైనా... అలాంటి పని..."

"కోపం వద్దు నిరూ! నా కలాంటి అనుమానం లేదు. కాని ప్రశంస వచ్చింది కాబట్టి చెబుతున్నాను. అందరి ఆడవారి లాంటిదాన్ని కాదు నేను. ఈ విషయంలో నా కున్నంత స్వార్థం ఎవరికీ వుండదు. అలాంటి విపరీతమే జరిగితే – నా శవమే నీకు మిగులుతుంది."

"అబ్బ! ఏమిటి నువ్వు? ఎన్నడూ లేనిది ఏమిటీ దారుణప్రసంగం? నే నింక వినను. వినను ఇందిరాప్రియా!"

మళ్ళీ ఆమే అతన్ని మరింత దగ్గరగా తీసుకొని ఓదార్చి అనునయించి, లాలించింది. "ఇప్పుడూ! ఇప్పుడూ నువ్వు నా అసలైన మనిషివి. నా తోడువి!"

అంత అన్యోన్యంగా, వేగంగా రోజులు, నెలలు గడిపేశారు. జరిగిపోతున్నాయి రోజులు. నెలలు ముందుకు నడిచాయి.

ఒకరోజు ఉత్తరం వచ్చింది ఇందిరాప్రియకు తండ్రిదగ్గర్నుంచి: ఆయన కు వంట్లో అస్వస్థగా వున్నదనీ, కూతుర్ని చూసి చాలారోజులు గడిచిపోయింది కాబట్టి, తనూ, తల్లీ ఆమెకోసం బెంగపెట్టుకున్నామనీ, ఒక్కసారి వచ్చి చూసి పోవలిసిందనీ మరీమరీ ప్రాధేయపడుతూ రాశాడు. నిరీక్షణరావుకు పంపించక తప్పలేదు. భర్తను వదల్లేక వదల్లేక బయల్దేరింది ఇందిరాప్రియ.

రైలు కదలబోతూండగా, ఆమె మృదుహస్తాన్ని పట్టుకునివున్న అతని చెయ్యి వణికి, కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"మీరు బాధపడకండి. మిమ్మల్ని విడిచి నేనుమాత్రం వుండగలనా? ఈ కాసిని రోజులూ స్నేహితులతో సరదాగా కాలక్షేపం చెయ్యండి," అన్న దామె లాలనగా.

"ఊ! స్నేహితులు. నాకేం అక్కర్లేదు! సరిగ్గా యిరవై రోజుల్లో మన మేరేజిడే! అప్పటికల్లా తిరిగి రాకపోతే ఏం జరుగుతుందో చూడు," అన్నా డతను ఉక్రోషంగా.

ఆమె దిగులుగా నవ్వి "అంత పెద్ద గడువు పెట్టారే! మీ రెంత కఠినులు!" అంది.

రైలు వెళ్ళిపోయింది.

తర్వాత అతనికి రోజో యుగంగా, చికాకుగా, దారుణంగా గడిచింది. పెళ్ళి కాకముందు తనలో యింత వ్యామోహం, కామం వున్నాయని అతనికి తెలియదు. "ఓహో! నే నెంత పిపాసిని? నాలో ఎంత ప్రేమ, మోహాంధకారం గూడుకట్టుకుని వున్నాయి? నే నెంతటి ప్రేమజ్వర పీడితుడ్ని!!!" అతను యిప్పుడు ఆశ్చర్యపోయాడు.

స్త్రీ పురుషుల మధ్యనున్న ప్రచండమైన ఆకర్షణ, బంధం, మోహావేశం, ఒకరిమీద ఒకరికి గల తృష్ణ, మమత, తీపి, ఒకరియందు ఒకరికి గల అవసరం, ఆ తోడులో దొరికే చల్లదనం, ఆ తోడులో దొరికే వెచ్చదనం, ఒకరిమీద ఒకరికి గల అధికారం–ఆ ఎడబాటులో అన్నీ అతనికి తెలిసివచ్చాయి.

మొదట వారం, పదిరోజుల్లో వచ్చేద్దా మనుకున్న ఇందిరాప్రియ తండ్రికి స్వస్థత చేకూరకపోయేసరికి తన ప్రయాణాన్ని ఒక్కొక్కరోజు, ఒక్కొక్కరోజు పొడిగించసాగింది. ఏ రోజు కా రోజు ప్రయాణ మయేది. "రేపు బయల్దేర్తున్నా" నని ఉత్తరం రాసేది. మళ్ళీ వాయిదా. ఈ ఉత్తరాలతో, వాయిదాలతో అతను పులకరిస్తూ, హతాశు డవుతూవచ్చాడు. నిరీక్షణ, నిరాశల మధ్య అతను నలిగిపోయాడు.

ఇలా మొత్తం పంధొమ్మిది రోజులు గడిచిపోయాయి. "నిరూ! ఇన్ని రోజులు ఆలశ్యం చేసినందుకు కోపం వచ్చింది కదూ! ఏం చెయ్యను? నాన్న పరిస్థితి ఏ క్షణాని కా క్షణం ఆందోళనగా వుంది. అయినా సరే! ఇహ ఉపేక్ష చెయ్యను. మన పుట్టినరోజు, అదే మన మిద్దరం ఏకమయిన రోజు – తూర్పున తొలిరేఖలు విచ్చుకునే సరికి నీ బాహుబంధంలో వుంటాను. నా మీద కోపగించటానికి నువ్వు పెదవులు విప్పబోతావు. ఉహు! నేను విప్పనీయనుగా. నిజమే! నేను తప్పు చేశాను మహానుభావా! తప్పు చేశాను. నీ యిష్టమైన శిక్ష విధించు. నీ యిష్టం! ఎంత కష్టమైనదయినా సరే! అనుభవిస్తానన్నానుగా! వచ్చేస్తున్నాను. ఇహ ఎప్పుడూ నిన్ను విడిచి వెళ్ళనుగా.

నీ నిండా ముద్దులతో..

ఊహు, చోటేదీ

ప్రియ'

ఆ ఉత్తరం చదువుకుంటూ, ముగ్ధ డవుతూ, పులకరిస్తూ, మైమరుస్తూ నివి

పాలు గడుపుతున్నాడు నిరీక్షణరావు - ఆ రాత్రి.

మెల్లగా పదకొండు దాటింది. బయట వర్షం తగ్గుముఖం పట్టకపోగా క్షణక్షణా నికీ ఉధృతం కాసాగింది. చలి ఎక్కువగానే వుంది. అతనికి నిద్ర రావటంలేదు. అయినా దుప్పటి ముసుగు పెట్టుకుని పడుకుందా మని, ఉత్తరం డ్రాయరుసొరుగులో పెట్టి, లేచి, లైటు ఆర్పేద్దామని, గోడ దగ్గరకు వస్తూండగా తలుపవతల ఎవరో దగ్గినట్లు చప్పుడయింది. అత నాశ్చర్యచకితుడై నిలబడిపోయాడు. ఇంతవర్షంలో తడుస్తూ, తమ వీధిగుమ్మంలో ఎవరు కూర్చున్నారు? దారినిపోయే పధికుడా? ఆ చీకటిలో, తీవ్రమైన వానలో తడుస్తూ ఎంత సేపటి నుంచీ కూర్చున్నారో? అతడికి చూద్దా మని కుతూహలం కలిగింది. ఒక నిముషం ఆలోచించి, తలుపుదగ్గరకు వెళ్ళి గడియ తీశాడు.

వెనువెంటనే బయటనుంచి వచ్చిన గాలి, వొత్తిడికి తలుపులు రెండూ వేగంగా తెరుచుకున్నాయి. ఈ శబ్దానికి ఉలికిపడి చూరుక్రింద తడుస్తూ వీధిగుమ్మం మెట్టు మీద కూర్చునివున్న మనిషి చటుక్కన తల త్రిప్పి చూసింది.



ఆ మనిషి యిరవై యిరవై రెండేళ్ళ యువతి. ఎంత చూరుకింద కూర్చున్నా, వాలుగా పడుతూన్న వర్షానికి తడిసి ముద్దయిపోయి, ముడుచుకుని కూర్చొని, చలికి గజగజమని వొణికిపోతున్నది. వెను దిరిగి చూసినప్పుడు ఆమె కళ్ళలో ఉలికి పాటూ, దీనత్వం, బాధా గోచరించాయి. తలుపులు తీయగానే లోపలకు వచ్చిన జల్లుకు అతనుకూడా తడవసాగాడు.

ఆ సమయంలో, వంటరిగా చీకటిలో చిక్కుకునిపోయిన ఆ స్త్రీని చూసి అతనికి జాలేసింది. "లోపలకు రండి," అన్నాడు అప్రయత్నంగా.

ఆమె సభ్యతకు లేచినిల్చుని "ఎందుకు లెండి; యిక్కడే గడిపేస్తాను," అన్నది వొణికే కంఠంతో.

"పర్వాలేదు. వర్షం యిప్పుడప్పుడే తగ్గే సూచనలు లేవు. ఎంతసేపని తడు స్తారు? రండి లోపలకు, అన్నా డతను" మర్యాదగా.

ఒక నిముషం ఆమె ఏమాలోచించు కున్నదో, తల ఊపి లోపలకు వచ్చి నిలబ డింది. జల్లు లోపలకు పడుతూ, గది తడిసి పోతున్నది. చేసేదిలేక అతను తలుపులు మూసి, గడియవేసి, ఆమెవైపు చూశాడు.

కట్టుకున్న దుస్తులు తడిసిపోయి, వంటికి అతుక్కుని, ఆరోగ్యంగా ఎదిగిన ఆమె శరీరం బహిర్గతమౌతూ, విద్యుత్ వెలుగులో మెరుస్తూ కనిపించగానే అతని మేను గగుర్పొడిచింది. జుట్టు తడిసిపోయి, అక్కడినుంచి నీళ్ళు కారుతూ, భుజాల మీదకూ, కంఠం మీదకూ, హృదయం

మీదకూ పడుతున్నాయి. ముఖం అందంగానే వుందిగాని మనిషిలో ఏమీ ప్రత్యేకత లేదు. అయినా నిమేషకాలం, ఆ దృశ్యం, ఆమె యవ్వనం, అతని అప్పటి మనస్తత్వానికి అనుగుణ్యంగా మారి, అతన్ని రెచ్చగొట్టాయి.

అతని వొంట్లోంచి ఆవిరి వచ్చినట్లయింది. కళ్ళు భగభగ మండాయి. "ఎవరు మీరు? ఈ వర్షంలో ఎలా చిక్కుకున్నారు?" అనడిగాడు, తనని తాను సంబాళించుకునేందుకు ప్రయత్నిస్తూ.

ఆమె యింకా చలికి వణుకుతూనే వుంది. తల ఎత్తి అతని ముఖంకేసి చూసి, మళ్ళీ వెంటనే దించేసుకుంటూ, "ఈ ప్రక్కవీధిలో ఒకరియింట్లో వంట చేస్తాను. ఇంటికి బయల్దేరేసరికి చినుకులేగాని, వర్షం పడడంలేదు. సరిగ్గా మీ యింటిదగ్గరకు వచ్చేసరికి పెద్దపెట్టున వర్షం వచ్చేసింది. అప్పట్నుంచీ యిక్కడే కూర్చుండిపోయాను," అన్నది నెమ్మదిగా.

అతను సహజంగా కొంత గాభరా మనిషి. గాలివానలో చిక్కుకుపోయిన అపరిచిత స్త్రీ...తన ఆశ్రయం...ఆ సమయంలో-తర్వాత ఎలా కొనసాగించాలో అతనికి స్ఫురించలేదు. తనిప్పుడు ఏం చెయ్యాలి? కనీసం రెండు మూడు గంటలయినా ఆమె తన యింట్లో గడపాలి. ఆ తర్వాతైనా అర్థరాత్రప్పుడు యింటికి ఎలా వెడుతుంది? తమ యిల్లు రెండే రెండు గదులు. ఒకటి యీ గది, రెండవది వంటయిల్లు. ఈ రెండింట్లో తాము సరి పెట్టుకోవాలి. అన్నిటికన్నా ముందు ఆ తడిసిన బట్టల్తో ఆమెను ఎక్కువసేపు వుంచటం భావ్యంకాదు. ఇందిరాప్రియ చీరె తీసి ఆమెకు యివ్వాలి. తన భార్య చీరె ఆమెను వేసుకోనియ్యడమా? అతని శరీరం గగుర్పొడిచింది. వంటిమీద ఏదో ప్రాకినట్లయింది. అయినా ... యింట్లోకి పిలిచి ఆదరించినప్పుడు, ఆ కొంచం సహాయం చేయడం తన కనీసపు కర్తవ్యం.

తన భార్య పెట్టెదగ్గరకు వెళ్ళి మూత తెరిచాడు. లోపల ఒకటే ఒక చీరె వుంది. ఇంకా రవికలూ వగైరాలు ఏమీ లేవు. అప్పుడు గుర్తు వచ్చింది. ఈమధ్యనే చాకలివాడు వస్తే తన బట్టలతోపాటు, ఆమె బట్టలుకూడా వేసేశాడు. వాడింకా తీసుకురాలేదు. మిగతావి ఆమె తనతో పాటు తీసుకువెళ్ళింది. మిగతావంటే మహా ఎన్నున్నాయి? మొత్తం అన్నీకలిపి ఆమె కున్న చీరలు చాలా తక్కువ. పొదుపరి కాబట్టి వాటితోనే సర్దుకుంటూ నిశ్చింతగా కాలక్షేపం చేస్తోంది.

పెట్టెలో వున్నది జరీఅంచు లేత ఆకుపచ్చ వెంకటగిరి నేతచీరె. ఆమెకు నేత చీరెలంటేనే మక్కువ ఎక్కువ. వాటి అందం వేటికీ రాదంటుంది. సిల్కులూ, టెరిలిన్లూ అసలు సరిపడవు. రెండు నెలల క్రితం ఆమె జన్మదిన కానుకగా యీ చీరె కొని మహుమతి యిచ్చాడు. ఒక్కసారి మాత్రం కట్టుకుని, భద్రంగా దాచేసుకుంది.

ఒక్క నిముషం ఆ చీరెను తాకేముందు సంకోచించాడు. మళ్ళీ మనస్సు దృఢపరుచుకుని చేత్తో అందుకున్నాడు. చెయ్యి వొణుకుతోంది.

తడబడుతూన్న కాళ్ళతో ఆమె దగ్గరకు నడిచివచ్చాడు. "ఆ తడిసిన బట్టలు విప్పేసి యీ చీరె కట్టుకోండి," అన్నాడు; గొంతు తడబడింది.

ఆమె కంగారుపడి వారిస్తూ "అయ్యో! యిప్పటికే ఎంతో శ్రమ తీసుకొన్నారు. మిమ్మల్నింకా యిబ్బంది పెట్టలేను. చీరె వద్దండీ. కాసేపు యిలాగే గడిపి వెళ్ళిపోతాను," అంది.

"అహా! అలాకాదు. ఎంతసేపని తడిదుస్తుల్లో వుంటారు. మొహమాట పడకండి. ఆ గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకోండి," అంటూ అతను బలవంతంచేశాడు.

ఆమె ముఖంలో తొట్రుపాటు స్పష్టంగా కనిపించింది. ఈ పరిస్థితి ఆమెకూ ఏమీ సుకరంగా లేదు. అయినా యింతవరకూ వచ్చాక చేసేదిలేదు. కృతజ్ఞతాపూర్వకంగా అతని వంక చూసి చీరె అందుకుంటూ "మీవాళ్ళు లేరా?" అనడిగింది.

అతని ముఖాన రంగు పులిమినట్లు అయింది. "ఊహు! పుట్టింటికి వెళ్ళింది."

ఆమె అతని కళ్ళలోకి ఒకసారి చూసి, చీరెతో వంటగదివైపు వెళ్ళి, లోపలకు పోయాక తలుపులు దగ్గరగా మూసుకుంది.

అయిదు నిముషాలు గడిచాక తలుపులు తెరుచుకుని, యివతలకు వచ్చింది. లేత ఆకుపచ్చ రంగు అతని కెంతో యిష్టం. జాకెట్టు లేదు. పమిటను హృదయం నిండా, రెండు భుజాలమీదుగా కప్పుకుంది. ఆ స్థితిలో తన భార్యే నిల్చుని వుంటే ఏంచేసేవాడు? చలించే మనసుతో ఆమె అందాలను చూడటానికి తాపత్రయపడుతూన్న అతను, ఆమె తనవైపు చూడటంతో సిగ్గుపడి, ముఖం తిప్పుకుని 'నిముషాల వ్యవధిలో ఎంత భయంకరంగా తయారయ్యాను?' అని తనని తా నిందించుకున్నాడు.

తను ఒక సుగుణాల రాసికి అంకితమైన వ్యక్తి. తన వాంఛలూ, ఉద్రేకాలూ, ఉప్పెనలూ ఒక వ్యక్తికే పరిమితం. ఇలా యితర ఆకర్షణలకు గురియై తన మనస్తత్వపు శిఖరాలకు కళంకం ఆపాదించుకోకూడదు.

ఒక మూలనున్న చాప తీసుకువచ్చి ఆమెకు ఇచ్చాడు. "చూడండి, ఇది పరుచుకుని వర్షం వెలిసేవరకూ ఆ గదిలో కాలం గడపండి," అన్నాడు. ఆమె తల ఊపి చాప అందుకుని పోబోతుంటే, "చూడండి, వంటగదిలో మిమ్మల్ని పడుకోబెడుతున్నందుకు ఏమీ..."


ఆమె చిన్నగా నవ్వి "పర్వాలేదు. వంటదాన్నే నేను. అలవాటేగా," అని ఒకసారి అతని కళ్ళలోకి చూసి వెళ్ళిపోయింది.

అతను అప్రతిభుడై నిలబడిపోయి, నిట్టూర్చి, మెల్లిగా అడుగులు వేసుకుంటూ, తన మంచం దగ్గరకు వచ్చాడు. అది పందిరి మంచం. పెళ్ళయాక ఇందిరాప్రియా, అతనూ కలసి బజారంతా తిరిగి మోజు పడి కొనుక్కున్నారు. అంతకుముందు తనకు మంచంలేదు. చాపమీదే పడక.

ఇందిరాప్రియ వుంటే ఆ మంచంమీద తెల్లటి మల్లెపూవులాంటి దుప్పటి పరిచి వుంచేది. మడత నలగటంగాని, మాసి పోవటంగాని జరగలేదు. ఇప్పుడు దుప్పటి నలిగి, మాసివుంది. మంచంమీద కూర్చుని వెనకపట్టెకు ఆనుకున్నాడు.

ఈనాడు తాను చేసిన పని ఎలాంటిది? తూరుపురేఖలు విచ్చుకోకముందే వస్తానంది తన భార్య. ఆమె వచ్చి యింట్లో యీ కొత్తమనిషిని చూస్తే వేరే ఏమయినా వుందా? ఏమని సమాధానం చెబుతాడు? ఎలా సమర్థించుకుంటాడు. ఈలోపునే యీమెను సాగనంపెయ్యాలి. వర్షం వెలిసిన ఉత్తరక్షణంలో యిక్కడి నుంచి పంపించివెయ్యాలి. అర్ధరాత్రి అయితే అవుగాక. అంతగా అయితే తను కూడా ఆమె యింటివరకూ తోడు వెళ్ళి దింపివస్తాడు.

వెనక్కి చారగిలబడి కళ్ళు మూసుకున్నాడు. తనలో యింత అల్పత్వ ముందని యిన్నాళ్ళూ తెలియదు. మానవుడు యింతగా వైవిధ్యాన్ని కోరుకుంటాడా? తను ఇచ్చిన చీరె కట్టుకుని, రవిక తొడుక్కోకుండా గుండ్రని భుజాలతో, నున్నని చేతులతో...ఆమె రూపమే కళ్ళముందు సాక్షాత్కరిస్తోంది. లోపలకు అడుగు పెట్టినప్పుడు తడిసిన దుస్తుల్లో తనక్కనిపించిన ఆమె రూపం గుర్తువచ్చింది. తనకు కనిపించిన ఆమె శరీరం, వొంటి రంగు, బిగువు అతన్ని కవ్విస్తూ కలవరపరుస్తోంది. రక్తం రయ్యిమని పరవళ్ళు తొక్కి ప్రవహిస్తోంది. ఇందిరాప్రియను తలుచుకుని ఆమెను మరిచిపోదామని




ప్రయత్నించాడు. చేతకాలేదు. కోరిక సురగలు క్రక్కుతోంది. కళ్ళు భగభగ మండుతున్నాయి. ఒకవైపునుంచి నీరసం, మరోవైపునుంచి ఆవేశం అతన్ని చుట్టి ముట్టేస్తున్నాయి. రానురానూ అతని మైకం పెరిగిపోయి తాగినవాడిలా తయారయ్యాడు. 'నేను తప్పు ఆలోచిస్తున్నాను,' అనుకున్నాడు.

'ఈ ఆలోచనలు బాగున్నాయి. ఇలా ఆలోచించకుండా ఉండలేకపోతున్నాను,' అనుకున్నాడు. 'ఈ ఆలోచన బాగుంది. నేను చెల్లాచెదరు అయిపోయాను. నేను చల్లారాలి, చల్లారాలి,' అనుకున్నాడు.

లేచి నిల్చున్నాడు. కంటి ముందు ఏవో చక్రల్లా కదుల్తున్నాయి. అడుగులు తూలుతున్నాయి.

'ఈ విశృంఖలత్వం....విశృంఖలత్వం-'

దగ్గరగా మూసివున్న వంటింటి తలుపుల్ని అతని చేతులు తెరిచాయి. ఆమె లైటు ఆర్పి పడుకోలేదు. చాప మీద ఓ చెయ్యి తలక్రింద పెట్టుకుని, ఓ ప్రక్కకు ఒత్తగిలి నిద్రపోతోంది. నిద్రలో పమిట ఓ పొర తొలిగి వొంటిపొర పమిటగా మారి, భుజంమీద ఆచ్ఛాదనం తొలిగి ఆ నునుపును అతని రక్తంలోకి సరాసరి సరఫరా చేశాయి.

అతని గుండె గబగబ కొట్టుకుంది. ఒక్కక్షణం అధైర్యం ఆవహించింది. అవసరం అధైర్యాన్ని పారద్రోలుతుంది. చిన్న చిన్న అడుగులు వేసుకుంటూ, ఆమెను సమీపించి, మోకాళ్ళ మీద కూర్చుని ఆమె ముఖంలోకి చూశాడు. బట్టలు మార్చుకునేముందు జుట్టు బాగా తుడుచుకున్నట్లుంది. ముంగురులు తడి ముఖంమీదకు పాయలుగా పడుతున్నాయి. అంత నిద్రలోకూడా చలికి ఆమె శరీరం చిన్న గగుర్పాటు చెందుతోంది. అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బరువుగా వస్తున్నాయి. ఆ క్షణంలో ఆమె అందం అతనికి అవసరం లేదు. ఆమె అతనికి కావాలి.

ఆమె ముఖంలోకి వొంగాడు. గుండ్రని ఆమె ముఖం, చెంపలు, పెదవులు అతనికి చేరువగా వచ్చేశాయి. కావలసిందల్లా ధైర్యమే. అతను ధైర్యం చేసేశాడు.

పెదవులు భగ్గుమనే సరికి ఆమె ఉలికి పడి కళ్ళు విప్పి చూసింది. తన ముఖం మీద అతని ముఖం, తన ఊపిరిలో అతని ఊపిరి-నిర్ఘాంతపోయి చూస్తోంది. అతని చేతులు తనని చుట్టేస్తున్నాయి. తన హృదయం అతని హృదయానికి హత్తుకుపోతోంది. తన కాళ్ళు కదలకుండా అతని

కాళ్ళు బంధించాయి. ముఖమంతా ఎడతెరిపి లేకుండా ఆతని పెదిమలు కాల్చేస్తున్నాయి.

పెదవులు విప్పి ఏదో అనబోయింది. అతని నోరు ఆమె నోటిని మూసింది. ఆమెకు ఊపిరి సలపటం లేదు. అయోమయంగా వుంది. అతన్ని వదిలించుకోవటానికి అశక్తురాలైంది. అసలు ప్రయత్నం చేయలేకపోయింది. కళ్ళప్పగించి చూస్తోంది. అతను వగరుస్తూ, కంపిత స్వరంతో ఏదో అంటున్నాడు. "నువ్వు... నాకు కావాలి, అడ్డు చెప్పకు."

అతని అనుభవం ముందు, గడుసుదనం ముందు దాసోహ మని ఆమె భాగ స్వామిగా మారిపోయింది.

కటికనేల కఠినత్వం, ఝల్లుమనే చల్లదనం అతను తట్టుకోలేకపోయాడు. "ఇక్కడ కాదు," అంటూ లేచి నిలబడి, ఆమెను అవలీలగా ఎత్తుకుని, ముందు గదిలోకి వచ్చి, మంచందగ్గరకు తీసుకు వెళ్ళాడు. ఆమెను మంచంమీద పడుకోబెట్టి తను వెళ్ళి లైటు ఆర్పేసి వచ్చి ఆమెమీద వ్రాలాడు.

* * *

నిరీక్షణరావు కళ్ళు తెరిచి చూసేసరికి మంచంమీద తను ఒక్కడే పడుకుని వున్నాడు. ఒక్క క్షణంపాటు జరిగిందంతా అతన్నికి కలగా తోచింది. కర్మ! కలకాదు, నిజమే. ఆమె ఏమయింది? గదిలో చీకటిగా వుంది. లేచి, చీకట్లో తడుముకుంటూ గోడదగ్గరకు వెళ్ళి స్విచ్ వేశాడు.

తాగుబోతువాడి కళ్ళకు కనిపించినట్లు మసక మసగా కనిపించింది దృశ్యం. తను లేచివచ్చిన పందిరిమంచంమీద కుప్పగా పడివుంది వెంకటగిరి నేతచీరె. గదిలో, వాతావరణంలో ఏదో మార్పు కనబడింది. అది సరిగ్గా బోధపడని మార్పు.

ఆమె ఎక్కడా కనిపించలేదు. వంటింట్లోకి వెళ్ళి చూశాడు. చాప చుట్టబడి ఓ మూలన వుంది. దండెంమీద ఆమె ఆరేసుకున్న తడిదుస్తులు కనిపించలేదు.

ఆమె వెళ్ళిపోయినందుకు అతనికి నిశ్చింతగానే వుంది గాని, జరిగిన పనికి కుమిలిపోతూ, మంచంమీదకు వచ్చి కూర్చున్నాడు. ముళ్ళమీద కూర్చున్నట్లు అనిపించింది. ఛంగున లేచి కూర్చున్నాడు. తల తిరుగుతోంది. ఎప్పుడో చల్లబడిన రక్తం నీరుగా మారింది. పశ్చాత్తాపం మీద పడి వికృతనృత్యం చేస్తోంది.

'అన్యాయం జరిగిపోయింది. నేను కోల్పోయిన అర్హత తిరిగిరాదు. ఓ మహా ప్రేమమూర్తికి, అనురాగరాశికి అన్యాయము జరిగిపోయింది.'

అతని కళ్ళనుండి నీళ్లు కారుతున్నాయి.

ఎదురుగా అద్దంలో అతని ప్రతిరూపం కనబడింది. 'చూడు నువ్వు, అల్పుడా! నీలోంచి మామూలుదనం వెళ్ళిపోయింది. లోకంలోని విశృంఖల వాదులు నన్ను చూసి నవ్వనీగాక, వ్యసనాలను అభిరుచులుగా భావించేవాళ్ళు నన్ను వెక్కిరించనీ, ఈ లోపం పూడదు, పూడదు.'

ఒకసారి భోజనానికి వచ్చిన స్నేహితులు గబగబ వచ్చి యీ మంచంమీద కూర్చున్నారు. వాళ్ళముందు ఇందిరా ప్రియ ఏమీ అనలేదుగాని, వాళ్ళు వెళ్ళిపోయాక– "చూడండీ. స్నేహితుల్ని అవశ్యం గౌరవించి, మర్యాద చేయవలసిందే. కాని దాని అర్థం సరాసరి తీసుకువచ్చి మంచాలు ఎక్కించటం కాదు. ఈ మంచానికి ఓ విలువ వుంది, నిర్వచనం వుంది. మా నాన్న మన ఇంటికి వచ్చినా దీని మీద ఆయనకు ప్రక్క వేయటానికి నా మనస్సు అంగీకరించదు." మృదువుగానే మందలించి, ఆ దుప్పటి తీసేసి ప్రక్క శుభ్రంగా దులిపి, మరో యిస్త్రీ దుప్పటి వేసింది.

ఆ మంచం చూస్తుంటే ఇప్పుడు ఏడుపు వచ్చింది.

మంచంమీద రాసిగా పడివున్న అర్ధాంగి మడతనలిగిన చీరె – అతని గుండెనెవరో నలిపినట్లయింది.

అప్రయత్నంగా అతని చూపు టేబిల్ మీది గడియారంమీదకు మళ్ళింది. త్రుళ్ళిపడ్డాడు. నాలుగు దాటింది. భార్యరాసిన ఉత్తరం జ్ఞాపకం వచ్చింది: తూర్పున తొలి రేఖలు...

అతని ముఖం పాలిపోయింది. శరీరమంతా చెమటలు క్రమ్మివేశాయి. ఒక్క నిముషం ఆ దశలో వుండి గబగబ వెళ్ళి బయటితలుపు గడియ పెట్టాడు. అలమారాలోంచి ఎలక్ట్రిక్ ఐరన్ తీశాడు. దాని ప్లగ్‌పిన్ ప్లగ్‌లో వుంచి, వేడెక్కేదాకా గదిలో ఉన్మాదిలా అటూ ఇటూ తిరుగుతున్నాడు.

బయట వర్షం ఆగిపోయింది. సర్వత్రా నిశ్శబ్దంగా వుంది. కాని అతని మనసు నిండా మాత్రం రౌరవ శబ్దాలు వ్యాపిస్తున్నాయి.

ఐరన్ వేడెక్కింది. టేబిల్ మీద న్యూస్ పేపరు పరిచి, చీరెను తీసుకువెళ్ళి, దాని మీద వుంచి జాగ్రత్తగా యిస్త్రీ చేశాడు. పెళ్ళయినప్పట్నుంచీ మామూలుగా బట్టలు చాకలిదానికి వేసినా, అవసరమైనప్పుడు యింట్లోనే యిస్త్రీ చేసుకోవటం యిద్దరికీ అలవాటయింది.

ఇస్త్రీ అయాక చీరె మడత పెట్టి, అందులో అస్వాభావికంగాని, భార్యకు అనుమానం కలిగించే అంశంగాని ఏమయినా వుందా అని తీక్షణంగా చూశాడు. తృప్తి కలిగాక తీసుకువచ్చి పెట్టెలో పెట్టి యథాస్థానంలో వుంచాడు.

తర్వాత కాలుగాలిన పిల్లిలా గదిలో అటూ ఇటూ తిరిగాడు. ఒక్కొక్క నిముషం యాతనగా గడవసాగింది. నీరసం ఆవహించి, వళ్లు తేలిపోతోంది.

మెల్లిగా అయిదయింది, ఆరయింది. వణకుతూన్న చేతులతో కిటికీ తలుపులు తెరిచాడు. ఆకాశాన మబ్బులు పలుచ

బడి, సూర్యరశ్మి వాటిని చీల్చుకువచ్చి భూమిని తాకుతోంది.

ఇందిరాప్రియ వచ్చే వేళయింది. అతన్లో రక్తం గడ్డకట్టినట్లయింది. ఆఖరికి అతన్లో తను స్టేషన్‌కు వెళ్ళాలనీ, భార్యను రిసీవ్ చేసుకోవాలి అనే యుక్తాయుక్త విచక్షణాజ్ఞానం నశించిపోయింది.

తలుపుమీద చప్పుడయింది. 'వచ్చేసింది. వచ్చింది. నా అబద్ధాల ముఖాన్ని చూసేస్తుంది,' అనుకుంటూ లేని ధైర్యం తెచ్చుకుని వెళ్ళి తలుపు తీశాడు. పాల మనిషి.

'హమ్మయ్య!' అనుకుని లోపలకు పోయి గిన్నె తీసుకువచ్చి నిలబడ్డాడు.

"ఇవాళ అమ్మగారు వస్తానన్నారుగా బాబూ! ఎప్పటిలా శేరుపాలు పోస్తాను," అంది పాలమ్మి.

అతను యాంత్రికంగా తల ఆడించి, పాలు పోయించుకున్నాడు.


మరో అరగంట గడిచినా ఇందిరాప్రియ రాలేదు. వర్షంవల్ల రైలు లేటయిందేమో. అతనికి స్టేషన్‌కు వెళ్ళి కనుక్కోవటానికికూడా భయంవేసింది. కాఫీ కలుపుకుని, తాగి, స్నానంచేసి కూర్చున్నాడు.

పదయినా ఇందిరాప్రియ రాలేదు. ఒక వంక భయం ఏడిపిస్తున్నా, అతన్లో ఆత్రుత కూడా ఎక్కువయింది. ఆఫీసుకు వేళకూడా అయింది. ఆమె రావటం ఆలశ్యమవుతూండేసరికి అతని పరిస్థితి మరీఅసందిగ్ధంగా తయారయింది. ఆమెను చూడాలన్న ఆరాటం, చూస్తే ఏమి జరుగుతుందోనన్న బాధా అతన్ని వేధించసాగాయి. చేసేదిలేక పదిన్నరకు యిల్లు తాళంపెట్టి, తాళంచెవి ప్రక్కింట్లో యిచ్చి, ఇందిరాప్రియ వస్తే యివ్వమని చెప్పి ఆఫీసుకు బయల్దేరాడు.

ఆఫీసులో ఒక్కొక్క క్షణం ఒక్కొక్క యుగంలా గడిచింది. ముళ్ళమీద కూర్చున్నట్లుగా వుంది అతనికి. ఎవరు పలకరించినా జవాబు చెప్పలేదు. ఏపనీ చెయ్యలేకపోయాడు.

సాయంత్రం ఇంటికి వచ్చేసరికి అయిదు దాటింది. ఆమె తప్పకుండా వచ్చివుంటుంది అని నమ్మకంతో వున్న అతనికి తలుపు తాళం చూడగానే ఆశాభంగమైంది.

ఎలా రాసింది ఉత్తరంలో? ఒకరికొకరు కలుసుకుని, ఆడుతూ పాడుతూ గడపవలసిన రోజు. ఆమె వస్తానని చెప్పి రాలేదు. తనని మోసం చేసింది. ఇహ–ఆ యింట్లోకి, ఆమె లేని శూన్యంలోకి పోనిచ్ఛగించలేదు. ఒక్కొక్కప్పుడు ఒక్కో వ్యక్తి కలయిక అస్థిమితహేతువే అయినా, ఆ వ్యక్తిని కలుసుకోకుండా వుండలేరు. ఒక్కొక్కరిలోని గురుత్వాకర్షణ అలాంటిది.



తాను, అలా బయట తిరిగివస్తాననీ, ఆమె వస్తే తాళంచెవి ఇవ్వమనీ పక్కింట్లో మళ్ళీ ఒకసారి చెప్పి, వెనక్కి తిరిగాడు. హోటల్‌కు వెళ్ళి, కాఫీ త్రాగి, ఆరు గంటలదాకా అంతులేకుండా నడిచి, తర్వాత ఏమి చెయ్యటానికీ తోచక, సినిమాకి వెళ్ళి కూర్చున్నాడు.

ఇహ యీ రోజుకు ఇందిరాప్రియ రాదు. ఆమెకు తనమీదికంటే, ఆ తండ్రి మీదే ఎక్కువ మమకారం – తనకు అన్నీ అబద్ధాలు రాసింది. అసలు తనంటే అత్యంలేదు.

అసలది ఏ సినిమానోకూడా అతనికి గుర్తులేదు, బయటకు వచ్చాక.

ఇవాళ ఆకలివిషయం గుర్తు రావటం లేదు. ఒకప్పుడు తనకు ఆకలేసేదా అనిపిస్తోంది.

వివిధ ఆలోచనలతో పరధ్యానంగా యింటికి చేరుకున్న అతను, లోపల దీపం వెలుగుతూండటంతో ఒక్కక్షణం నివ్వెరపోయి నిలబడ్డాడు. ముఖం నెత్తురుచుక్క లేకుండా పాలిపోయింది. మనసులో భగవంతుణ్ని ప్రార్థించుకొని, ధైర్యమంతా కూడదీసుకుని మెల్లెక్కి తలుపు తోశాడు. తలుపులు దగ్గరగా వేసివున్నాయి; చెయ్యి పడగానే తెరుచుకున్నాయి.

లోపలకు అడుగుపెట్టిన అతను మళ్ళీ మరోమారు నిర్ఘాంతపోయాడు.

లేత ఆకుపచ్చ రంగు వెంకటగిరి నేత చీరె కట్టుకుని, శిగలో మల్లెచెండు తురుముకుని, పందిరి మంచంమీద దేవతలా పడుకొనివుంది ఇందిరాప్రియ.

అతనిముందు పది సర్పాలు బుసకొట్టినట్లయింది. 'లే అక్కణ్నుంచి ఇందిరాప్రియా నువ్వు! ఆ చీర విప్పెయ్యి,' అని గట్టిగా అరుద్దామనుకున్నాడు.

కాని అరవలేదు. కళ్ళప్పగించి చూస్తూ నిలబడ్డాడు.

చప్పుడు విని ఆమె తల త్రిప్పి చూసింది. ఆనందాశ్చర్యాలతో ఆమె కనులు మెరుపులా మెరిశాయి. మంచంమీదనుంచి ఒక్క గెంతు గెంతింది. మరుక్షణంలో అతనామె కౌగిలిలో వున్నాడు.

"నిరూ!! నేను తిరిగి... వచ్చేశాను... వచ్చేశాను. ఇన్నాళ్లూ నీకోసం నా ప్రాణం ఎంతకొట్టుకుందని? నీతో గడుపని క్షణం లేదు. నిరూ నువ్వు ... గడుసువాడివి. నా గడుసుతనం మంటగలిపావు ... అబ్బ! నన్ను విడిచి ఎలావున్నావో యిన్నాళ్లూ? ఒట్టిదే. నీ ప్రేమంతా వొట్టిదే. లేకపోతే నన్ను చూడకుండా ఎలా జీవించగలిగావు? ఊఁ! నువ్వు నేర్చావులే."

ఆమె కౌగిలిలో అతనికి ఊపి రాడటం లేదు. మనసు నీరై ప్రవహిస్తే, ముఖం ఆమె ఎంగిలితో తడిసింది. అయినా మాట్లాడకుండా అప్రతిభుడై నిలబడ్డాడు.

"మాట్లాడవేం నువ్వు? రాసిన రైముకి రాలేదని కోపం వచ్చిందా? ఏం చెయ్యను చెప్పు? రాత్రి కురిసిన వర్షానికి రైళ్ళు బయల్దేరలేదు. నా ప్రాణం ఎంత కొట్టుకుపోయిందో, నేనెంత తహతహ లాడానో ఆ భగవంతునికే తెలుసు. అలా నిల్చుంటావేం? మాట్లాడూ...! ఊఁ...మాట్లాడూ..."

"మామగారు కులాసాగా వున్నారా?" అతని పెదవులు యాంత్రికంగా కదిలాయి.

"ఇప్పుడు బాగానే వుంది. నిన్ను చూడలేదని నాన్న మహా యిదయిపోయాడు. మనిద్దర్నీ ఒకసారి కలిసిరమ్మన్నాడు," అని అతని ముఖంలోకి చూసి విచారంగా, "ఈ నెలరోజులలో ఎంత చిక్కిపోయావో చూడు నువ్వు; పాపిష్టిదాన్ని, ఇహ నిన్ను విడిచి ఎక్కడకూ పోనుగా, బుద్ధివచ్చింది. దా, బట్టలు మార్చుకో. ఇద్దరం కలిసి భోంచేద్దాం," అంటూ అతని చెయ్యి పట్టుకుని లాక్కు వెళ్ళి, పెట్టెలోంచి యిస్త్రీ పంచ, చొక్కా తీసియిచ్చింది.

"ఇవాళ మన యిద్దరికీ పండగలాంటిది. అయినా బయటకు వెళ్ళి యిద్దరం సరదాగా గడపటానికి వీల్లేకపోయింది. పోనీలే, మనమిద్దరం కలిసి ఎక్కడ గడిపితే అక్కడే మన పండగ. త్వరగా బట్టలు మార్చుకుని రా; ఈలోపల నేను అన్నం వడ్డిస్తూ వుంటాను," అంటూ ఇందిరాప్రియ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

అతని గుండె దడదడ కొట్టుకుంటోంది. శరీరమంతా నీరసం, మగతా క్రమ్మివేస్తున్నాయి. యాంత్రికంగా బట్టలు మార్చుకుని వంటింట్లోగుండా పెరట్లోకి వెళ్ళి, కాళ్ళూచేతులూ కడుక్కు వచ్చేసరికి, ఆమె కంచాలనిండా వడ్డించి, అంతా సిద్ధం చేసివుంచింది.

ఆమె యింటికి వచ్చాక వండిన అన్నం పువ్వుల్లా పరిచివుంది. ఎప్పుడు చేసిందో రెండు కూరలూ, పచ్చళ్ళూ – వడ్డించి వున్నాయి. అవిగాకుండా పుట్టింటినుంచి తీసుకువచ్చిన పూతరేకులూ, లడ్లూ అలంకరించింది.

"నీకు పూతరేకులంటే యిష్టంకదూ! అరడజనయినా తినకపోయావో – నీతో యిహ మాట్లాడను. ఏమిటలా చూస్తూ కూర్చున్నావు తినకుండా! భోజనం అయినాక కావలసినంతసేపు చూడు తనివి తీరా!" ఇందిరాప్రియ ఆనందంగా నవ్వింది.

భోజనం చేస్తున్నంతసేపూ ఆమె ఆనందంగా ఏవో కబుర్లు చెబుతూ, కవ్వించటానికి ప్రయత్నం చేస్తూనేవుంది. అయినా అతన్లో కదలికలేదు. ఉన్నట్లుండి ఆమె మాట్లాడటం ఆపి, అతని ముఖంవంక రెప్ప వేయకుండా చూస్తూ, "నీలో ఏదో మార్పు వచ్చింది నిరూ!" అనేసింది.

నిరీక్షణరావు ఉలికిపడ్డాడు. ఆమె నిశిత నేత్రాలు తనలోని మాలిన్యాన్ని పరిశోధిస్తున్నవా?

"అబ్బే! లేదే" అన్నాడు తడబడుతూ.

"కాదు. మీరు అబద్ధం చెబుతున్నారు. ఎప్పుడూలేని స్తబ్ధత, బెదురు, దాచుకుంటూన్న ఉద్వేగం మిమ్మల్ని ఆవహించినై. కారణం చెప్పండి నాకు చెప్పరూ?" ముందుకు వొంగి అతని ముఖంలో ముఖం

పెట్టి అపేక్షగా, బాధగా అడిగింది ఇందిరా ప్రియ.

అతనికి భయంవేసింది. తను దొరికిపోతున్నాడా? ఈ రహస్యాన్ని ఎలా దాచుకోవడం?

"నిజం ఇందిరాప్రియా! కారణం ఏమీ లేదు. నువ్వు లేని వెల్తి నన్ను జడుడ్నిగా చేసింది. అంతే."

"అంతేనా?" అంది ఆమె నిట్టూర్చి. కాని ఆమె గొంతులో అంతతృప్తి కనబడ లేదు.

భోజనాలు ముగిశాయి. వంటింటి పని ముగించుకువచ్చి, ఆమె మంచం శుభ్రంగా దులిపి, ప్రక్క చక్కగా వేసింది. వేసి, యిటు తిరిగి నవ్వుతూ "మీ కిష్టమైన చీరె కట్టుకున్నాను యీ రోజు. బాగుందా?" అన్నది నవ్వుతూ.

అతని గాయాన్ని స్పిరిట్‌తో కడిగినట్లయింది. 'విప్పెయ్యి! ప్లీజ్! నా మీద కనికరించి ఆ చీరె విప్పెయ్యి' అని అరుద్దా మనుకున్నాడు.

"బాగుంది," అన్నాడు ఆమె చూపులు తప్పించుకుంటూ. ఆమె గడియారం వంక చూసి "అబ్బ! పదకొండు కావస్తోంది. ఇహ పడుకుందాం రండి," అంది మృదువుగా.

అతను తల ఊపి దగ్గరకు వచ్చాడు.

ఆమె బెడ్‌లైట్ వెలిగించి గోడకు తగిలించి, స్విచ్ ఆఫ్‌చేసి మంచం దగ్గరకు వచ్చింది. అతని బుజంమీద చెయ్యి వేసి "ఏమండీ! నాలో ఏమయినా మార్పు వచ్చిందా?" అని అడిగింది.

''లేదు, ఎప్పటిలాగానే వున్నావు."

"రండి."

ఇద్దరూ మంచంమీదకు వెళ్ళి కూర్చున్నారు. ఆమె లోపలికి జరిగి, అతని ఒడిలో తలపెట్టుకు పడుకుని, చెయ్యి తన హృదయంపైన వుంచుకుని, "ఏడాది క్రితం మనం ఎవరమో! ఒకరంటే ఒకరికి తెలియదు. ఇప్పుడు ఎంత ఏకం అయిపోయామో చూడండి," అన్నది అనుభూతులొలికే కంఠంతో.

ఆ మంచంమీద ఆమెతో అలా గడపటం అతనికి ముళ్ళమీద కూర్చున్నట్లుగా వుంది. శరీరమంతా మంటలు ఎగజిమ్ముతున్నాయి.

"జవాబు చెప్పరేమండీ?"

"ఇందిరాప్రియా!" అన్నాడు గాద్గదిక కంఠంతో. "నన్ను మూగవాడ్ని చేసేశావు నువు.''

''నిరూ! అదేమిటి నీ కంఠం"

"ఇందిరాప్రియా! మనం...మనం...?"

"చెప్పు. చెప్పు నిరూ!"

''నన్ను ఒక్క నిముషమైనా వంటరిగా వుంచవద్దు ఇందిరాప్రియా! నువ్వు లేని నేను బలహీనుడ్ని. నువ్వు లేని నేను తైలంలేని దీపాన్ని. నువ్వు నా రక్షణవు. నాకు రక్షవు. ఏదీ నా చెయ్యి వదులు; నీ పాదాలు తాకనీ..."

"నిరూ! ఏమిటిది నీకు పిచ్చి?'' అంటూ ఆమె అతన్ని గట్టిగా తన మీదకు లాక్కుంది. అతని ముఖాన్ని తన ముఖానికి దగ్గరగా లాక్కుంది. అతని శరీరాన్ని ప్రేమగా నిమిరింది. ''వెర్రి నీకు. ఇంత పసితనం అయితే ఎలా నాన్నా?"

అతను రానురానూ ఆమెలో కరిగిపోతున్నాడు. ఏకమైపోతున్నాడు. ఇరువురూ అస్పష్టంగా మాట్లాడుకుంటున్నారు. హఠాత్తుగా అతనికి జ్ఞానోదయం కలిగినట్లయింది. "వద్దు, ఇందిరాప్రియా! యివేళ వద్దు,'' అన్నాడు చప్పున గోడవైపు తిరిగి.

ఆమె ఆశ్చర్యాన్విత అయింది. అతన్ని తనవైపు త్రిప్పుకునేందుకు ప్రయత్నిస్తూ "మనం ఒకరి నొకరు కవ్వించుకుంటూ సంతోషంగా గడపవల్సిన యీరోజు ఏమిటీ చేష్టలు...ఏం జరిగింది నీకు? అనడిగింది.

అతని గుండె గబగబ కొట్టుకుంది. రక్తం నోట్లోకి వచ్చినట్లయింది. చెప్పేద్దామని నోటిదాకా వచ్చింది.

కాని అనుకోకుండా బొంకాడు: "నాకు ... నాకు ... యివేళ గుండెల్లో నొప్పిగా వుంది."

ఇందిరాప్రియ వ్యధిత హృదయురాలు అయింది. ఆమె కళ్ళలో నీళ్ళు నిండుకొచ్చాయి. "అయ్యో భగవంతుడా! ఈ రోజు యిలా తగలబడిందేమిటి? ఇదంతా నేనే చేసుకున్నాను!'' అంటూ అతని జుట్టులోకి వ్రేళ్లు పోనిచ్చి దువ్వుతూ ''అయితే నువ్వు హాయిగా పడుకుని విశ్రాంతి తీసుకో. నీ కేమన్నా జరిగితే నేను భరించలేను. నువ్వు చల్లగా వున్న రోజే నాకు పండుగ."

అతన్ని మరింత దగ్గరకు లాక్కుని ''నిరూ! జన్మజన్మాలకు నీ భార్యగానే వుండాలని నేను కోరుకుంటాను. మధ్యలో ఎవరైనా తల దూర్చాలని ప్రయత్నిస్తే వాళ్ళని చీల్చి చండాడుతాను. వాళ్ళ రక్తం కళ్ళ చూస్తాను. పడుకో నాన్నా. నా నీడన నిద్రపో. చంటిపిల్లాడిలా నాలో ఒదిగిపో."

ఆమె అతని వీపు మీద చెయ్యివేసి నిమరసాగింది. అతని కళ్ళనుండి నీళ్లు కారుతున్న సంగతి ఆమె గుర్తించలేదు. ఆ పందిరిమంచం అతనికి ముళ్ళపాన్పువలె వున్న సంగతీ, ఆమె కట్టుకున్న చీరె అతన్ని కాలుస్తోన్న సంగతీ ఆమెకు తెలియదు.

అలా మంటతో, ఏడుస్తూ, గిలగిల్లాడుతూ అతను ఎప్పటికో నిద్రపోయాడు.

*    *    *

అంతే, అది-అది అతని జీవితానికి తీరని సమస్యగా పరిణమించింది. ఈ రహస్యమా? దాచుకోవటానికి అతని యిరుకు హృదయంలో చోటు వుండటంలేదు. చెబితే? అగ్నిపర్వతాలు బ్రద్ధలవుతాయి. సంసార నౌక నిర్దయగా తునాతునకలైపోతుంది. రోజూ ఆ మంచంమీదే పడుకోవాలి. ఆ చీరె తరుచూ కళ్ళబడుతూ వుంటుంది. ఆ రాత్రి జరిగిన సంఘటన అతని ముందు వివిధ రూపాలతో సాక్షాత్కరిస్తోంది. ఈ అగ్నిని దాచుకోలేకపోతున్నాడు. ఒక్కొక్క రోజు ఒక్కొక్క యుగంగా గడుస్తోంది. చిక్కి శల్యమైపోతున్నాడు. సరిగ్గా అన్నం తినటం మానేశాడు. ఎప్పుడూ పరధ్యానంగా వుంటాడు. ఆమె ముట్టుకోబోతే దూరంగా తొలగిపోతాడు. ఆమె అతని వంక నిశితంగా చూస్తే, ముఖం చాటు చేసుకుంటాడు.

ఇందిరాప్రియ అతని వాలకం చూసి బెంగపెట్టుకుంది. "ఏం జరిగింది నిరూ నీకు? ఎందు కిట్లా అయిపోయావు? నా ముందు ఏమీ దాచవద్దు. నిజం చెప్పు. అది ఎంతటి విషంలాంటిదైనా సరే భరిస్తాను. నువ్వు దేనికో పశ్చాత్తాప పడుతున్నావు. నాకు చెప్పెయ్యి; అంతా చెప్పెయ్యి. నేను నీ భార్యను. నా ముందు రహస్యాలు వుంచుకోకు," అని ప్రాధేయపడేది.

ఊహుఁ. చెప్పలేదు. ఆమె అలా అంటుంది గాని యీ నిజాన్ని ఆమె భరించలేదు. అది బయటకు వచ్చిన క్షణంలో ఆమె ఆత్మహత్య చేసుకుంటుంది.

ఈ అశాంతితో అతను కృశించి పోతున్నాడు.

రాత్రిళ్ళు నిద్రలో కలవరిస్తున్నాడు. ఆఫీసుకు సరిగ్గా వెళ్ళటం మానేశాడు. అతనికి జ్వరం వచ్చింది.

జ్వరం తగ్గటంలేదు. ఇందిరాప్రియ హడిలిపోయింది. డాక్టర్లు వస్తున్నారు. మందులు పోస్తున్నారు. అతనికి నిమ్మదించటంలేదు. "ప్రభూ! నా మాంగళ్యం కాపాడు. నన్ను ఉద్ధరించు!"

ఒక సాయంత్రం అతను మాగన్నుగా నిద్రపోతున్నాడు. ఆరోజు శుక్రవారం. ఆమె మెల్లిగా తలుపులు దగ్గరకు వేసి కనకదుర్గ గుడికి బయల్దేరింది.

తన దాంపత్యం నిలబెట్టమని, అమ్మవారిని ప్రార్థించి, పూజ ముగించుకుని, మొక్కుకుని, యింటికి తిరిగి వచ్చింది.

పందిరి మంచం మీద భర్త లేడు. ఆమె కళ్ళు నులుముకుని చూసింది. అసలు పందిరిమంచమే లేదు. కలిగిన విభ్రాంతిలోనుండి తేరుకుంటూ వుండగా, పెరట్లోంచి ఏవో శబ్దాలు వినిపించాయి. గబ గబ వంటిల్లు దాటి పెరట్లోకి వెళ్ళి అక్కడ కనిపించిన దృశ్యం చూసి నిశ్చేష్టితయై నిలబడింది.

నిరీక్షణరావు ఒక చేతిలో గొడ్డలినీ, మరో చేతిలో ఆకుపచ్చ రంగు చీరే పట్టుకుని నిలబడి వున్నాడు. పందిరిమంచం ముక్కలు ముక్కలుగా చేయబడి పెరట్లో పోసివుంది. అంతకుముందే కిరసనాయిలు దానిమీద గుమ్మరించి నిప్పు అంటించినట్లున్నాడు. పెద్ద మంటలు లేచి, కొయ్యముక్కలు తగలబడుతున్నాయి. మంట బాగా రాచుకోగానే తన చేతిలోని చీరెను అందులోకి విసిరేసి, ఉన్మత్తుడిలా తిలకిస్తూ నిలబడ్డాడు.

ఇందిరాప్రియ రక్తం గడ్డకట్టినట్టు అయింది. తూలిపడబోయి ఎలాగో నిలద్రొక్కుకుని నిలబడింది. వెనక సవ్వడి విని నిరీక్షణరావు తల త్రిప్పి చూసి, ఆమె దగ్గరకు వచ్చి, "చూడు ఇందిరాప్రియా! ఇన్నాళ్ళూ నీ ముందు దాచిన రహస్యం, యిప్పుడు తగలబడుతోంది. నీవు యింట్లో లేని సమయాన నీ చీరె కట్టుకున్న ఓ యువతితో మన పందిరిమంచంమీద పాపం చేశాను. అంతా దైవికం. ఇన్నాళ్ళూ దాచుకున్నాను నాలో. ఇహ దాచుకోలేకపోయాను. ఆ రెండు జ్ఞాపకాలూ నశించిపోతేనేగాని నాకు మనశ్శాంతి లేదు. ఇప్పుడు నా కే జ్వరమూ లేదు. ఎక్కడలేని బలమూ వుంది. నీకు చేసిన ద్రోహాన్ని చేతులు కట్టుకుని ఒప్పుకుంటున్నాను, ఇందిరాప్రియా! నాకు ఏ శిక్షనైనా విధించు. సంతోషంగా భరిస్తాను; కాని ఆత్మహత్యమాత్రం చేసుకోకు. ఆ ఒక్క ఉపకారమూ నాకు చెయ్యి!"

ఆమె కళ్ళు చీకట్లు క్రమ్ముతున్నాయి. అతని మాటలు ఏ లోకంనుంచో వస్తున్నట్లు వినిపిస్తున్నాయి.

"ఇదే జరక్కూడ దనుకున్నాను. ఈ రహస్యం ఆయన చెప్పకపోయినా బాగుండేది. కోట్లకొలదీ దాంపత్యాలలో మాదీ ఒకటి అయిపోయింది!"

ఆమె క్రింద పడిపోబోతుండగా అతను ఆదుకున్నాడు.

కళ్ళు తెరిచేసరికి అతని వొడిలో వుంది.

అతని చెయ్యి ఆమె పాదాలమీద వుంది. "ఇందిరాప్రియా! నన్ను క్షమించవా?" అతను చిన్నపిల్లాడిలా ఏడుస్తున్నాడు.

ఆమె అతని చేతిని బలహీనంగా తన అధీనంలోకి తీసుకుంది. ముఖంమీద పడిన ముంగురులలోంచి అతనివంక దీనంగా చూసింది.

"క్షమించక్కర్లేదు. మెల్లిగా మరిచిపోదాం. అలవాటు పడదాం!"